

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


## ఏఎస్పీని కలసిన రేంజి ఆఫీసర్ నాసిర్ ఝా





Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 206 పేజీలు - 08 వెల - 05/-

గురువారం 23-07-2026



### భోగాపురం విమానాశ్రయ

# ప్రారంభోత్సవానికి ఆహ్వానం

- ఢిల్లీలో ప్రధానితో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- ఆగస్ట్ 1న జరగనున్న కార్యక్రమానికి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు
- ప్రత్యేక బాధ్యతలతో నలుగురు ఐఏఎస్ అధికారుల నియామకం
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అంచనా

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

మిగతా 2లో



# 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు..

- 7.5 కోట్ల విద్యార్థులు ప్రభావితమయ్యారని వ్యాఖ్య
- ఒక్క కేసులోనూ శిక్ష పడలేదని విమర్శ
- విద్యార్థుల డిమాండ్లు సమంజసమేనంటూ మద్దతు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- ప్రధాని క్షమాపణ చెప్పాలని రాహుల్ పట్టు

నీట్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. మిగతాది 2లో



2

## పార్లమెంట్‌కు నల్ల దుస్తుల్లో విపక్షాలు..

● నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు వచ్చిన ఇండియా కూటమి ఎంపీలు ● పోలీసుల తీరుకు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో ఆందోళన ● పీఎం నివాసం వద్ద నిరసనలో రాహుల్‌ను అరెస్ట్ చేయడంపై ఆగ్రహం ● దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని ఆరోపించిన కాంగ్రెస్ ● నీట్ వివాదంపై ప్రతిష్టంభనతో స్తంభించిన పార్లమెంట్ కార్యకలాపాలు

ప్రధాని అధికారిక నివాసం వద్ద మంగళవారం జరిగిన హైడ్రామా అనంతరం, బుధవారం ఇండియా కూటమి ఎంపీలు తమ నిరసనను తీవ్రతరం చేశారు. పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ఎంపీలందరూ నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు చేరుకున్నారు. పార్లమెంట్ వెలుపల గుమిగూడిన విపక్ష నేతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

# నీట్‌పై చర్చకు సిద్ధం..

## రాజకీయాలు చేయొద్దు: కేంద్రం

ఎన్డీయేతర రాష్ట్రాల్లోనూ పేపర్ లీకులు జరిగాయన్న మంత్రి



2

- విద్యార్థుల అంశంపై రాజకీయాలు వద్దని నడ్డా సూచన
- ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో చర్చకు రావాలని పిలుపు
- సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష విరమించాలని కోరిన నడ్డా
- ప్రధాన్ రాజీనామాపై సభలోనే చర్చించాలని సూచన

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సుదీర్ఘ చర్చకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించొద్దని ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సూచించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన నడ్డా.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం నీట్ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుంటోందన్నారు. అయితే ప్రతిపక్షాలు విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో చూస్తున్నాయని విమర్శించారు. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, తెలంగాణ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్, కేరళ, కర్ణాటక వంటి ఎన్డీయేతర పాలిత రాష్ట్రాల్లో కూడా పేపర్ లీక్ ఘటనలు జరిగాయని గుర్తుచేశారు.

### జంతర్ మంతర్ వద్ద

# ఆందోళనలు..

● ప్రజాస్వామ్యంలో నిరసన, అసమ్మతి చాలా కీలకమన్న నీట్ టాపర్ ఆర్యన్ గుప్తా ● పరీక్ష రద్దయినందుకు బాధపడ్డానని, ఆ తర్వాత తేరుకున్నానని వ్యాఖ్య ● నీట్ పరీక్ష అంశంలో సీజేపీ ఆందోళనల నేపథ్యంలో వ్యాఖ్యలు



ప్రజాస్వామ్యంలో నిరసనలు, అసమ్మతి అనేవి అత్యంత కీలకమైనవని, అవి వ్యవస్థలో అంతర్భాగమని 'నీట్' టాపర్ ఆర్యన్ గుప్తా అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలను నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పరీక్షలో ఆర్యన్ గుప్తా 720 మార్కులకు గాను 715 మార్కులు సాధించి సత్తా చాటారు. పరీక్ష రద్దు కావడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆర్యన్ గుప్తా పేర్కొన్నారు. "ప్రారంభంలో నేను తీవ్ర నిరాశకు గురయ్యాను. ఆ పరిస్థితి నన్ను మానసికంగా కుంగదీసింది. పరీక్ష రద్దయినందుకు ఎంతో బాధపడుతూ కన్నీళ్లు పెట్టుకున్నాను"

మిగతాది 2లో

## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..



- శ్రీకాకుళంలోని నివాసం నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- ఇంటి వద్ద వైకాపా కార్యకర్తలు చేరడంతో ఉద్రిక్తత
- కొడుకు చేసిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి
- కుమారుడిని కాపాడేందుకు కుట్ర చేశారనే ఆరోపణలు
- మరో వ్యక్తిని కేసులో ఇరికించేందుకు ప్రయత్నించారని అభియోగం

2

# ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి



- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్
- ప్రధాని మోదీ జోక్యం చేసుకుని ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి
- యువత హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టీకరణ

నీట్ పేపర్ లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుంచి తొలగించలేకపోతే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మోదీని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు తన నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం

## మన్యం జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు

- ఉప ముఖ్యమంత్రివర్యుల ఆదేశాలతో గుచ్చిమి క్యాంపుకు తరలించేందుకు ఏర్పాట్లు
- పలమనేరు శిబిరంలో అటవీ శాఖ సన్నాహాలు పూర్తి
- ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలకు అడవి ఏనుగుల బెడద నుంచి ఉపశమనం

2



## వారు శ్రీకాకుళం పరువు తీశారు



- ● తమ్మినేని భూ భాగోతాలపై విచారణ జరపాలని ఆదేశించామన్న అచ్చెన్నాయుడు
- ● బతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం దారుణమని వ్యాఖ్య
- ● పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడి

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అక్రమాలు ఇంకా చాలా ఉన్నాయని, వాటన్నిటిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మిగతాది 2లో

# జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు..



“ప్రారంభంలో నేను తీవ్ర నిరాశకు గురయ్యాను. ఆ పరిస్థితి నన్ను మానసికంగా కుంగదీసింది. పరీక్ష రద్దయినందుకు ఎంతో బాధపడుతూ కన్నీళ్లు పెట్టుకున్నాను” అని ఆయన తన ఆవేదనను పంచుకున్నారు. అయితే, ఈ క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నది తాను ఒక్కడినే కాదని తర్వాత గ్రహించానని తెలిపారు. “నిజానికి అది అన్యాయమే, కానీ ఈ సమస్యను ఎదుర్కొన్నది నేను ఒక్కడినే కాదు. దాదాపు 22 లక్షల మంది అభ్యర్థులు అదే పరిస్థితిని ఎదుర్కొన్నారు, మళ్ళీ పరీక్ష రాయాల్సిన అనివార్యత ఏర్పడింది. అయితే, ఆ సమయంలోనే నాకు మరొక అవకాశం లభించిందని సానుకూల దృక్పథంతో ఆలోచించాను. మరుసటి రోజు నుంచే మళ్లీ చదవడం ప్రారంభించి, శాయశక్తులా కృషి చేశాను. ఆ కష్టానికి ప్రతిఫలమే నేడు నా ముందున్న ఈ ఫలితం” అని ఆర్యన్ వివరించారు

నీట్ పేపర్ లీక్ ఆరోపణలు, విద్యా సంస్కరణల ఆవశ్యకతపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో ఆర్యన్ గుప్తా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా వ్యవస్థల జవాబుదారీతనాన్ని ప్రశ్నించడంలో యువత గొంతుక కీలక పాత్ర పోషిస్తుందని ఆయన నొక్కిచెప్పారు. నీట్ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సీజేపి కార్యకర్తలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ ఆందోళనలకు పలువురు ప్రముఖులు, ప్రతిపక్ష నేతల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

## 10 ఏళ్లలో 152 పేపర్ లీక్‌లు.. ఒక్కరికీ శిక్ష లేదు: రాహుల్



గత పదేళ్లలో 152 ప్రశ్నపత్రాల లీక్‌లు జరిగాయని, దీంతో 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరికీ శిక్ష పడలేదని విమర్శించారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన రాహుల్, ప్రశ్నపత్రాల లీక్‌లపై నిరసన తెలుపుతున్న విద్యార్థుల డిమాండ్లు పూర్తిగా సమంజసమైనవేనన్నారు. వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం బలప్రయోగానికి దిగుతోందని ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అవినీతిపరుడు, అసమర్థుడని విమర్శిస్తూ ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మూడు ప్రధాన డిమాండ్లను కేంద్రం ముందు ఉంచారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ మొత్తం వ్యవహారంపై ప్రధానమంత్రి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి, కుటుంబాలు రూ.లక్షలు ఖర్చు చేసినా ప్రశ్నపత్రాల లీక్‌ల కారణంగా వారి భవిష్యత్తు దెబ్బతింటోందని రాహుల్ అన్నారు. ఈ పరిస్థితుల్లో సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు నష్టపోతుండగా, ప్రత్యేక అవకాశాలు ఉన్నవారికే ప్రయోజనం చేకూరుతోందని ఆరోపించారు.

# పార్లమెంట్‌కు నల్ల దుస్తుల్లో విపక్షాలు..

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన ‘చలో సంసద్’ మార్చ్‌కు మద్దతుగా నిన్న విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ క్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా పలువురు ఇండియా కూటమి నేతలు ప్రధాని నివాసం వద్ద నిరసనకు యత్నించారు. అయితే, పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని వ్యాన్లు, బస్సుల్లో తరలించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.

ఈ అరెస్టులు, పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తూ విపక్ష ఎంపీలు నేడు నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు వచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీల ఎంపీలు మకర ద్వార్ వద్ద నిలబడి ప్రభుత్వ

వైఖరిపై నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ.. “నిన్న ప్రతిపక్ష నేతను సిగ్గులేకుండా అరెస్ట్ చేసి, గాయపరిచిన తీరు దారుణం. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనం. రాజ్యాంగం ఉనికిలో లేదు. ఈ ప్రభుత్వంతో శాంతియుతంగా పోరాడటమే మా ముందున్న ఏకైక మార్గం” అని తీవ్రంగా విమర్శించారు.

మరో కాంగ్రెస్ ఎంపీ కె. సురేశ్ మాట్లాడుతూ.. “ప్రతిపక్ష నేత, ఇతర ఎంపీలపై పోలీసులు జరిపిన దౌర్జన్యానికి నిరసనగానే మేమంతా నల్ల దుస్తులు ధరించి నిరసన తెలుపుతున్నాం” అని అన్నారు.

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రభుత్వం, విపక్షాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో పార్లమెంట్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ వివాదం కారణంగా ఉభయ సభల్లోనూ ప్రతిష్టంభన కొనసాగుతోంది.

# వారు శ్రీకాకుళం పరువు తీశారు: మంత్రి

ఆదేశాలు జారీ చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ నేతల అరాచకాల వల్ల జిల్లా ప్రతిష్ట మసకబారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నుంచి మంత్రిగా, సభాపతిగా కీలక బాధ్యతలు నిర్వహించిన వారు చేసిన దారుణాలు చూసి నివ్వెరపోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లుగా చిత్రీకరించి భూములు కాజేయడం సిగ్గుచేటని, అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే తాను ఆత్మహత్య చేసుకునేవాడినని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ స్పీకర్‌గా విలువలతో కూడిన ఉపన్యాసాలు ఇచ్చి, తెరవెనుక ఇలాంటి అక్రమాలకు ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. తప్పు చేసిన వారికి, వారిని సమర్థించే వారికి నైతికత లేదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు అలాగే తయారైందని విమర్శించారు. గతంలో తనపై పెట్టినవన్నీ తప్పుడు కేసులు కాబట్టే తాను ధైర్యంగా ఉన్నానని, అక్రమాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలతో ఆగమేఘాల మీద అరెస్టులు చేసే సంస్కృతి తమ ప్రభుత్వానిది కాదని తేల్చి చెప్పారు.

### రైతుల సమస్యలపై జగన్ నాటకాలు

గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని జగన్మోహన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. పొగాకు, ఆక్వా రైతుల సమస్యలకు కేంద్రం నుంచి త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పొగాకు కొనుగోళ్లలో తలెత్తిన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారని, ఢిల్లీలో జరిపిన చర్చలు సఫలమయ్యాయని వివరించారు. ఆక్వా ఫీడ్ ధరల తగ్గింపు విషయంలోనూ కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సానుకూల పరిణామాలను జీర్ణించుకోలేక, జగన్ తన పార్టీ కార్యకర్తలకు రైతు కండువాలు కప్పి కొత్త నాటకాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు.

పొగాకు, ఆక్వా రైతుల సమస్యలకు కేంద్రం నుంచి త్వరలోనే పరిష్కారం

రాష్ట్రం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసిన చేసిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పొగాకు రైతులతో జగన్ జరిపిన సమావేశం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేంద్ర మంత్రులు పొగాకు కొనుగోళ్లు, ఆక్వా ఫీడ్ ధరల తగ్గింపు అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వైసీపీ కార్యకర్తలకు రైతు కండువాలు వేసి జగన్ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు.

# వేగం పుంజుకున్న పల్నాడు--ప్రకాశం ‘జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార’ మెగా తాగు నీటి పథకాల పనులు

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అధిక ప్రాంతాలు తాగునీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉండే పల్నాడు--ప్రకాశం లాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని దిశా నిర్దేశం చేశారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకంలో భాగంగా పల్నాడు--ప్రకాశం ప్రాంతాల్లో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనులు నిర్ణీత గడువులోపు పూర్తి కావాలని ఆదేశించారు. బుధవారం పల్నాడు--ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులు వివరించారు. రెండు మెగా ప్రాజెక్టుల అంచనా వ్యయం దాదాపు రూ. 2,500 కోట్లు కాగా, అందులో రూ. 1,290 కోట్ల అంచనా వ్యయంతో ప్రకాశం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో, 593 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించిన ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి ఇంటేక్ వెల్ నిర్మాణం పనులు 40 శాతానికి పైగా పూర్తయ్యాయి. 119 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్ పనులు, సంపులు, గ్రౌండ్ లెవల్ బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రకాశం వాటర్ గ్రిడ్ పథకం కింద ఇప్పటి వరకు 53 కిలోమీటర్ల మేర పైపు లైన్ల నిర్మాణం పూర్తి చేసినట్టు వివరించారు.రూ. 1,200 కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పథకాన్ని 235 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించగా, ఇప్పటికే 152 కిలోమీటర్ల మేర పైపు లైన్ నెట్వర్క్ పూర్తయ్యింది. ఇన్ టేక్ వెల్స్, రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పనులు కూడా పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 95 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేసినట్టు తాగునీటి సరఫరా విభాగం అధికారులు వివరించారు. అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ “తాగు నీటి సమస్యతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్న పల్నాడు, ప్రకాశం ప్రాంతాల ప్రజలకు ఈ ప్రాజెక్టులు జీవనాధారంగా మారనున్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన అమరజీవి జలధార మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు చాలా కీలకమైనవి. వీటి నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిర్ణీత గడువులోపు ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి, లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ తాగు నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలి. గ్రామాల మధ్య పైపు లైన్ల నిర్మాణం, అటవీ అనుమతులు లాంటి సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించుకునే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయండి.పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణ కార్యకలాపాలను సాధ్యమైనంత వేగంగా ముందుకు తీసుకువెళ్లాలి. భుజం శస్త్ర చికిత్స నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత పనుల పురోగతిని పరిశీలించేందుకు క్షేత్ర స్థాయి పర్యటనలు చేపడతాను. స్వయంగా పనుల నాణ్యతను పరిశీలిస్తా. జల్ జీవన్ మిషన్ పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దు. పల్నాడు, ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు పూర్తయితే ఈ రెండు ప్రాంతాల పరిధిలోని సుమారు 10 నియోజకవర్గాల పరిధిలో 16 లక్షల మందికి పైగా ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత ఏర్పడుతుంద”న్నారు. ూ

## నీట్‌పై చర్చకు సిద్ధం.. రాజకీయాలు చేయొద్దు: కేంద్రం

వాటిపై ప్రతిపక్షాలు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో బిజినెస్ అడ్వైజరీ కమిటీ ఎంత సమయం కేటాయించినా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నడ్డా తెలిపారు. పరీక్షల వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్ఠంగా మార్చేందుకు ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం అన్ని పార్టీలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రిలో పరామర్శించినట్లు నడ్డా వెల్లడించారు. ఆయన దీక్ష విరమించి యువతకు సానుకూల దిశలో నాయకత్వం వహించాలని కోరినట్లు చెప్పారు. వాంగ్‌చుక్ ప్రభుత్వానికి లేఖ రాశారని, దానికి తగిన విధంగా స్పందిస్తామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై స్పందించిన నడ్డా.. అలాంటి అన్ని అంశాలపై పార్లమెంట్‌లోనే చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు.

## ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయండి

నియోజకవర్గం నుంచే ప్రతిన బూనుతున్నానని ఆయన వెల్లడించారు. బీజేపీ గాడ్సే వారసత్వానికి ప్రతీక అయితే, కాంగ్రెస్ పార్టీ మహాత్మా గాంధీ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకున్న వారసత్వం కలిగిన పార్టీ అని ఆయన వ్యాఖ్యానించారు. నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ కలిసి ఈ దేశాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో వారిని ఏమాత్రం విజయం సాధించనివ్వబోమని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో వీధుల నుంచి పార్లమెంటు వరకు పోరాటం సాగించి బీజేపీని ఓడిస్తామన్నారు. యువత భవితవ్యంతో, దేశ భవిష్యత్తుతో మోదీ చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)తో పాటు ఇతర విపక్షాలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ పరిణామాల వల్ల విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా తీవ్రంగా నష్టపోతున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థపై ప్రజలకు తిరిగి నమ్మకం కలిగించాలంటే తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలంటూ ఇప్పటికే పలు వర్గాల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షల నిర్వహణలో లోపాలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించి, భవిష్యత్తులో సంస్కరణలు చేపడతామని ప్రకటించినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర మంత్రిపై వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నాయి.

## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్ట్..


శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జీఎంఈ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ నడిపిన బైక్ ఢీకొనడంతో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో కుమారుడిని కాపాడేందుకు అప్పలరాజు కుట్ర చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు.ప్రమాదానికి కారణమైన ఆరవ్ వర్మకు బదులుగా సిద్దార్థ త్యాడి అనే వ్యక్తిని కేసులో ఇరికించి జైలుకు పంపే ప్రయత్నం చేశారని, బాధిత కుటుంబాన్ని ప్రలోభపెట్టారని, అలాగే ప్రమాదానికి సంబంధించిన బైక్‌ను మార్చి ఆధారాలను తారుమారు చేయాలని చూశారన్న అభియోగాలతో అప్పలరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే ఆయన్ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ ‘అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం’ ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## మన్యం జిల్లాకు రెండు కుంకీ ఏనుగులులి



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాలతో రెండు కుంకీ ఏనుగులను పలమనేరు క్యాంపు నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకి తరలించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ముసలమడుగు క్యాంపు నుంచి వీటిని పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపుకి తరలించనున్నారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారి చొరవతో అడవి ఏనుగుల బెడదతో దీర్ఘకాలంగా పడుతున్న ఇబ్బందుల నుంచి పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు ఉపశమనం కలగనుంది. ఉపముఖ్యమంత్రివర్యుల సూచనతో రాష్ట్రంలోని నానియాల్ ఏనుగుల శిబిరంలో ప్రత్యేక శిక్షణ పొందిన జయంత్ అనే కుంకీతో పాటు కర్ణాటక నుంచి తీసుకువచ్చిన అభిమన్యుని పార్వతీపురం మన్యం జిల్లాకి తరలించేందుకు అటవీ అధికారులు సిద్ధం చేశారు. ఈ రెండూ... మానవ--ఏనుగు సంఘర్షణ నియంత్రణ కార్యక్రమాల్లో అత్యంత అనుభవం కలిగిన కుంకీ ఏనుగులు. ఇటీవల కాలంలో అభిమన్యు, జయంత్ లు ఆరు మేజర్ ఆపరేషన్లలో భాగస్వామ్యమై విజయవంతంగా పూర్తి చేశాయి. ఇటీవల పలమనేరు సమీపంలో ఒంటరి మగ అడవి ఏనుగుని బంధించిన ఆపరేషన్ లో ఈ రెండు కుంకీలు అత్యంత కీలకంగా వ్యవహరించాయి. రెండింటి మధ్య సమన్వయం, ఆపరేషన్లలో పనితీరు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేశారు.

పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దులకు ఒడిశా రాష్ట్రం నుంచి అడవి ఏనుగుల గుంపులు పదే పదే తరలివస్తున్నాయి. వ్యవసాయ భూముల్లో చొరబడి పంటలను నాశనం చేయడంతో పాటు గ్రామాల మీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. అడవుల విభజన, అటవీ ఆవరణ తగ్గడం, ఆహారం, నీటి కొరత తదితర సమస్యల కారణంగా తరచూ అడవి ఏనుగులు ఒడిశా సరిహద్దుల నుంచి మన్యం జిల్లాకి చెందిన గ్రామాల్లో చొరబడుతున్నాయి. మన్యం జిల్లాలో ఏనుగుల బెడద నివారణకు ఒడిశా ప్రభుత్వంతో చర్చించి, తిరిగి మళ్లింపు చర్యలు చేపట్టడంతోపాటు ఆ రాష్ట్రం నుంచి కుంకీ ఏనుగులను కూడా తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు నిర్ణయించారు. అంతకంటే ముందు తక్షణ ఉపశమన చర్యల్లో భాగంగా మన రాష్ట్రంలో అందుబాటులో ఉన్న రెండు కుంకీలను పలమనేరు నుంచి గుచ్చిమి క్యాంపుకి తరలించాలని ఆదేశించారు. గుచ్చిమి క్యాంపు నుంచి ఈ రెండు ఏనుగుల సహాయంతో సమస్యాత్మక ప్రాంతాల్లో సంఘర్షణల నియంత్రణ చర్యలు చేపడతారు. వీటితోపాటు సౌర కంచెల నిర్మాణం, ఏనుగులను నిరోధించేందుకు వీలుగా కందకాలు తవ్వడం, నీటి వనరుల అభివృద్ధి, ఏఐ ఆధారిత పర్యవేక్షణ,

# “ట్రాన్స్ఫారం దగ్గర పొంచి ఉన్న ప్రమాదం”



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. న్యూక్లియస్ బాలికల కాలేజీ, కిడ్నీ ఆసుపత్రి ప్రక్కనగల ట్రాన్స్ఫారము ప్రమాదకరంగా ఉన్నది. కాలేజీ వదిలినప్పుడు బాలికలను తీసుకొని పోవడానికి వచ్చిన తల్లిదండ్రుల బైకులు, కాలేజీ వదిలినాక ట్రాన్స్ఫారం చుట్టూ బాలికలందరూ ట్రాన్స్ఫారం దగ్గర నిలబడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫారం చుట్టూ భద్రతను ఏర్పాటు చేసి ముందుచూపుగా ఏ ప్రమాదం జరగకుండా చూసుకోవాలని కాలేజ్, కిడ్నీ ఆసుపత్రి యాజమాన్యాలకు బాలికల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేసుకుంటున్నారు. ఇంతకు మునుపు కూడా ఇది ట్రాన్స్ఫారం గురించి విద్యుత్ అధికారులకు తెలియపరచిన చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న విద్యుత్ అధికారులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఏ ప్రమాదం జరగక మునుపే ఆ ఇబ్బందిని సరి చేయవలసిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.

# కొన ఊపిరిలో ఉన్న మినుము పంటకు ఊపిరి పోసిన వాన

☛పంట పండి పెట్టుబడి వచ్చేనా !

☛మినుముపంటలో జోరుగా కలుపులు తీస్తున్న కూలీలు





దొర్నిపాడు జూలై 22 పల్లె వెలుగు న్యూస్ రైతులు మినుము పంట సాగు చేసి సుమారు40రోజులు కావొస్తుంది,సాగుకు ముందు కురిసిన అర కొరకవర్షానికి రైతులు మినుము పంటసాగు చేశారు సాగు చేసింది మొదలు వర్షం జాడలేకవేసిన పంట ఎండా గాలికి వాడిపోయి కొనఊపిరిలో ఉన్న పంటపై వానదేవుడు కరుణించి వర్షం కురిసి పంటకు ఊపిరి పోశాడు, 40 రోజుల తర్వాత పడిన వానకుఎండిన పంట కాసింత పచ్చబడడంతో పంట పండుతుంది, పెట్టుబడి వస్తుందనేధీమాతో రైతులుపంటలో జోరుగా కూలీల చేత కలుపులు తీయించుకుంటున్నారు, పెట్టుబడి రావాలన్న వానదేవుడు మరోసారి కరుణించి వాన పడితే పంట చేతికి వస్తుంది అంటున్నారు రైతులు తీరా పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు అధికమైతే పంటఅంతావానపాలుఅవుతుందనిగోవిందిన్నేకు చెందిన రైతు యూసఫ్ మరికొందరు రైతులు అంటున్నారు, మండలంలో సుమారు వందల ఎకరాల్లో మినుము పంటసాగు చేశారు అతివృష్టి అనావృష్టి కారణంగా పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేందుకు బీమా సౌకర్యం ఏర్పాటు చేసింది పంట బీమా వస్తుందనేధైర్యంతో రైతులుబీమాచేయించుకుంటున్నారు,

# ఏఎస్పీని కలసిన రేంజి ఆఫీసర్ నాసిర్ ఝా



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 22: నంద్యాల ఏఎస్పీగా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన ఖాదర్ భాషను బండి ఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్ ఝా కలిశారు. బుధవారం నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ ఎస్ పి ని,నాసిర్ ఝా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో నెలకొన్న సమస్యలపై వారిరువురూ చర్చించారు. అటవీ సంపద పరిరక్షణ విషయంలో పోలీస్ శాఖ పరంగా తన వంతు సహకారం ఉంటుందని ఏ ఎస్ పి ఖాదర్ బాషా రేంజి ఆఫీసర్ నాసిర్ ఝా తో పేర్కొన్నారు.

# నేడు బండి ఆత్మకూరులో మౌలాలి స్వామి సరిగెత్తు



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 22 : బండి ఆత్మకూరులో గురువారం మౌలాలి స్వామి సరిగెత్తును నిర్వహించనున్నారు. వారం రోజుల క్రితం గ్రామంలో మౌలాలి స్వామి పీర్ల పెట్టెను గ్రామంలో ఊరేగించి కొలువు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి నిప్పుల గుండాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు పూనుకుంటున్నారు. నంద్యాల జిల్లా వైఎస్ఆర్ పార్టీ మహిళా సంఘం అధ్యక్షురాలు రాజంపేట సుజాతమ్మ కుటుంబీకుల ఆధ్వర్యంలో ఈ సరిగెత్తు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాత్రి 12 గంటల తర్వాత మౌలాలి స్వామి కొలువు నుండి బయలుదేరిన అనంతరం గ్రామంలో మేళ తాళాల మధ్య ఊరేగింపు నిర్వహిస్తారు.

# 24న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బందును జయప్రదం చేయండి యుఎస్ఎఫ్ఐ పిలుపు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నీట్ పేపర్




లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని యు ఎస్ ఎఫ్ ఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న నీట్ యూజీ పేపర్ లీకేజీ, నిర్వహణ వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. గత రెండు రోజులుగా దేశ రాజధాని ఢిల్లీ వీధులలో విద్యార్థుల పై జరిగిన దమనకాండను నిరసిస్తూ 24 న ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కు యు ఎస్ ఎఫ్ ఐ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు జై సింహా రెడ్డి, నంద్యాల జిల్లా కార్యదర్శి సురేంద్రనాయక్ నాయకుడు దేవానంద్,సురేష్,పవన్,,నరేష్ శివ, పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలలోని కేసీ కెనాల్

# సౌందరీకరణ పనులు వేగవంతం చేయాలి.

**● ఆగస్టు లోపే కేసీ కెనాల్ బ్యూటిఫికేషన్ పూర్తి చేయాలి. ● రూ.32 లక్షలతో కేసీ కెనాల్ అభివృద్ధి పనుల పరిశీలన. ● మెడికల్ కాలేజ్ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలి. ● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని కె.సి. కెనాల్ – నూనెపల్లె సప్లై ఛానల్ సుందరీకరణ (బ్యూటిఫికేషన్) పనులను ఆగస్టు నెలాఖరు లోపే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మెడికల్ కాలేజీ పరిధిలో రూ. 32 లక్షల వ్యయంతో చేపట్టిన కె.సి. కెనాల్ – నూనెపల్లె సప్లై ఛానల్ సుందరీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాల పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా కెనాల్ సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని సూచించారు. కెనాల్‌లో పాడైపోయిన లైనింగ్‌ను మరమ్మతు చేయడంతో పాటు ఇన్‌స్పెక్షన్ పాత్‌ను ఏర్పాటు చేసి గ్రావెల్ వేయాలని, కెనాల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి దంపులు, పొదలు, కలుపు మొక్కలను పూర్తిగా తొలగించి పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. టెండర్ నిబంధనల ప్రకారం మూడు నెలల గడువులో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, ఆగస్టు నెలాఖరు లోపే అన్ని పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కెనాల్ సమీపంలో ఉన్న మట్టి దంపులను







వెంటనే తొలగించి, గ్రీనరీ అభివృద్ధి పనులు చేపట్టాలని ఏ పి ఎం ఎస్ ఐ డి సి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను కలెక్టర్ ఆదేశించారు. కేసీ సబ్ కెనాల్ పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణ పురోగతి, హాస్టల్ భవనాల సిద్ధత, విద్యా కార్యక్రమాల నిర్వహణ, ల్యాబ్‌ల పనితీరు తదితర అంశాలపై ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. సురేఖను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో ఫ్యాకల్టీ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి బోధన, ల్యాబ్ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయని ప్రిన్సిపల్ కలెక్టర్ కు వివరించారు. మున్సిపల్ నీటి సరఫరా వంటి కొన్ని చిన్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో కేసు కెనాల్ ఈఈ ప్రతాప్, ఏ పి ఎం ఎస్ ఐ డి సి, ఈఈ నిరంజన్ రెడ్డి, వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సి. హెచ్. రమ్యా రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది కలెక్టర్ వెంట వున్నారు.

# పి జి ఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్‌తో సేవల నాణ్యతకు కొత్త ఊతం.

**☛ప్రజల అభిప్రాయాలతో మరింత పారదర్శకంగా ప్రభుత్వ సేవలు.**

**☛ప్రతి పి జి ఆర్ ఎస్ కార్యాలయంలో ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ఏర్పాటు.**

**☛జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రజల సమస్యలను పారదర్శకంగా, వేగవంతంగా, సమర్థవంతంగా పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పి జి ఆర్ ఎస్) ను మరింత ప్రజాకేంద్రీకృతంగా తీర్చిదిద్దే దిశగా పి జి ఆర్ యస్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ప్రభుత్వ సేవలపై ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించి, వాటి ఆధారంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పి జి ఆర్ ఎస్ నిర్వహించే కార్యాలయాల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద పి జి ఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, అలాగే పి జి ఆర్ ఎస్ సేవలు అందించే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి శాఖ అధికారి తమ కార్యాలయాల ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద, ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో పి జి ఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఈ క్యూ ఆర్ కోడ్ వినియోగంపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించి, వారి సమస్య పరిష్కారమైన వెంటనే మొబైల్ ఫోన్ ద్వారా క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

అదేవిధంగా ప్రతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ బోర్డులు ఎల్లప్పుడూ స్పష్టంగా కనిపించేలా, సక్రమంగా నిర్వహించేలా సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రజల అభిప్రాయాలను సేకరించడం ద్వారా ప్రభుత్వ సేవల నాణ్యతను నిరంతరం మెరుగుపరచడంతో పాటు అధికారుల పనితీరును మరింత సమర్థవంతంగా సమీక్షించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పి జి ఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ పై విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అందే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వ సేవల నాణ్యత పెంపునకు సమర్థవంతంగా వినియోగిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

**ప్రజలకు విజ్ఞప్తి**

పి జి ఆర్ ఎస్ ద్వారా మీ సమస్య పరిష్కారమైన అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పి జి ఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి మీ అభిప్రాయాన్ని నమోదు చేయండి.

మీ ఫీడ్‌బ్యాక్ ప్రభుత్వ సేవలను మరింత ప్రజా అనుకూలంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు పాత్ర పోషిస్తుంది.

జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించే ప్రతి పౌరుడు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ సేవల నాణ్యతను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం.

## క్రమశిక్షణ, నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**● విద్యతో పాటు భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట. ● వసతి గృహ విద్యార్థినులకు విద్యా, నిత్యావసర సామగ్రి పంపిణీ - మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్. ● విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, భద్రత, వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వసతి గృహ విద్యార్థినులకు విద్యా, నిత్యావసర సామగ్రి పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొని విద్యార్థినులకు డ్రెస్ మెటీరియల్, కార్పెట్లు, టాయిలెట్ కిట్లు, స్వెటర్లు, షూస్, నైట్ డ్రస్సులు తదితర వస్తువులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో విద్యార్థుల భోజన నిధులను 10 శాతం పెంచి నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హాస్టళ్లలో చిక్కీలు, కోడిగుడ్లు, నిర్ణీత మెనూ ప్రకారం ఆహారం సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువుకునేందుకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. యూనిఫాంలు, దుప్పట్లు, తువాళ్లు, షూస్, నైట్ డ్రస్సులు, ఇతర అవసరమైన వస్తువులతో పాటు అన్ని సంక్షేమ సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు పేదరికాన్ని అధిగమించి సివిల్స్, ఇతర అత్యున్నత పోటీ పరీక్షల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కష్టపడి సాధించిన వారిని ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో చదివితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని మంత్రి సూచించారు.

విద్యార్థినుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో పోలీసుల తనిఖీలు నిర్వహించడం, వాచ్‌మన్‌లు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి తర్వాత వసతి, రవాణా సౌకర్యాల లేమితో చదువు మానేసే పరిస్థితులు లేకుండా ప్రభుత్వం హాస్టళ్లను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్యార్థినులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కృషి చేసి స్వయం సమృద్ధిని సాధించాలని సూచించారు. 'తల్లికి వందనం' వంటి సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని మంత్రి పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు డీఎస్సీతో పాటు ఇతర ఉద్యోగ అవకాశాలకు సిద్ధం కావాలని కోరారు. డిజిటల్ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కంప్యూటర్ సదుపాయాలను కల్పిస్తోందని, విద్యార్థులు వేదికపై మాట్లాడే భయాన్ని అధిగమించి డిబేట్లు, సెమినార్లు, ప్రెజెంటేషన్లలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కళాశాలల్లో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని యాజమాన్యాలకు సూచించారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను సాకారం చేసేలా క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులు, పౌష్టికాహారం, విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. హాస్టల్ జీవితం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకార భావం, పోటీ తత్వాన్ని పెంపొందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివి పోటీ పరీక్షల్లో రాణించాలని, పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ తర్వాత చదువు మానేయకుండా డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ వరకు విద్యను కొనసాగించాలని సూచించారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, భోజనం, ఇతర వివరాలను వాట్సాప్ గ్రూపుల ద్వారా తల్లిదండ్రులకు నిరంతరం తెలియజేయాలని వసతి గృహాల వార్డెన్లు, వెల్ఫేర్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీనివల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు, అధికారులు మధ్య మంచి అనుబంధం ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచడం, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అలవాట్లను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హాస్టల్ గదులు, పరిసరాలను స్వయంగా పరిశుభ్రంగా ఉంచుకునే అలవాటు పెంపొందించుకోవాలని, ప్రతి గదికి ఇన్‌ఛార్జ్‌లను నియమించి రొటేషన్ పద్ధతిలో బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. కిచెన్ పరిశుభ్రత, ఆహార నాణ్యత, మెనూ అమలును విద్యార్థులే నాయకత్వంతో పర్యవేక్షించాలని పేర్కొన్నారు.







పరీక్షలకు ముందు మాత్రమే చదివే అలవాటు మానుకుని ప్రతిరోజూ నిరంతర సాధన చేయాలని, సందేహాలను వెంటనే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. వచ్చే ఏడాది రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతిభా అవార్డులు సాధించాలనే లక్ష్యంతో కృషి చేయాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. చదువుతో పాటు సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, క్రీడలు, వక్తృత్వం, వ్యాసరచన, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. భయాన్ని విడిచిపెట్టి ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. భవిష్యత్ లక్ష్యాలపై ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకుని, కెరీర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజానికి సేవ చేయాలంటే ముందుగా వ్యక్తిగతంగా విజయం సాధించాలని సూచిస్తూ, విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివారెడ్డి, వివిధ సంక్షేమ వసతి గృహాల అధికారులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకుంటున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం రద్దు చేసుకోవాలి.

బేతంచెర్ల పల్లె వెలుగు ప్రతినిధి జులై 22:-- కంద్ర ప్రభుత్వం అమెరికా తో చేసుకుంటున్న






స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే నిలిపివేయాలని, బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ భారత్ బేకరీ కూడలి నందు, ఎపి.రైతు సంఘం మండల కార్యదర్శి పి.రామ మోహన్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. . ఈ సందర్భంగాఎపి రైతు సంఘం(ఎఐకెఎస్) జిల్లా ఉపాధ్యక్షులు వి.సుబ్బరాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మధుశేఖర్, సిఐటియు నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ ఈ ఒప్పందం జరిగితే, అమెరికా నుండి పన్నులు లేకుండా వచ్చే చౌక దిగుమతుల వల్ల మొక్కజొన్న, మామిడి, పత్తి, పాలు పౌల్ట్రీ రంగం తదితర పంటల ధరలు పడిపోయి,భారత దేశ రైతులు తీవ్రంగా నష్టపోతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ద్వైపాక్షిక ఒప్పందం వల్ల దేశంలోని 11 కోట్ల మంది రైతులు, 8 కోట్ల మంది పాడి రైతులు దివాళా తీసే ప్రమాదం ఉందన్నారు. అన్ని పంటలకు జ2౦50 ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని,రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని, పేద, మధ్య తరగతి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు 10 వేల పెన్షన్ ఇవ్వాలని నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, నారాయణ, బాబయ్య, రాజేష్,వెంకటపుల్లారెడ్డి,అయ్యన్న,ఎస్టి గఫార్, మధు, బ్రహ్మం,ఆంజనేయులు మరియు రైతులు కార్మికులు పాల్గొన్నారు.అనంతరం ఈ ఒప్పందం పై సంతకం చేయ వద్దని విన్నపముతో రాష్ట్ర పతి ద్రౌపదిమూర్ము గారికితెలుప వాలేనని రైతులతో సంతకాలు చేసినపత్రాన్ని మండల తహసీల్దార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. యంగ్ డెమోక్రట్స్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని,



విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యంగ్ డెమోక్రట్స్ -- ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నంద్యాల గాంధీ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు వెంటనే ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడకూడదని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో యంగ్ డెమోక్రట్స్ ఏపీ జాయింట్ కన్వీనర్ షేక్ అజహరుద్దీన్, స్టేట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు సయ్యద్ ఇంతియాజ్, షేక్ తౌసీఫ్, ఎస్ డి పి ఐ నంద్యాల జిల్లా జనరల్ సెక్రటరీ ఏజెస్ హుస్సేన్, ఎస్ డి పి ఐ నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు ఫాజిల్ దేశాయ్, నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ జాయింట్ కన్వీనర్ షేక్ ఫయాజ్, మొహమ్మద్ అలీ ఖాన్, కమిటీ సభ్యులు ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణికి అభినందనలు.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. కళ్యాణిని నంద్యాల అర్బన్ హెల్త్ సెక్రటరీల యూనియన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మావతి ఆధ్వర్యంలో హెల్త్ సెక్రటరీలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజారోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణలో సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణి మాట్లాడుతూ, పట్టణ పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణలో హెల్త్ సెక్రటరీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పద్మావతి, యూనియన్ సభ్యులు, హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**● రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ చేపట్టిన బీజేపీ నాయకులు**

**● జలదుర్గం గ్రామంలో విత్తన బస్తాల అందజేత**



పల్లె వెలుగు -ప్యాపిలి రైతుల సంక్షేమం వారి అభివృద్ధియే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కె.సి. మద్దిలేటి, మండల అధ్యక్షులు కె.బి. దామోదర్ నాయుడు తెలిపారు. మంగళవారం రోజున జలదుర్గం గ్రామంలో ప్రభుత్వం రాయితీపై అందించిన వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.

?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఒక్కో రైతుకు మూడు వేరుశనగ విత్తన పాకెట్లను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోందని పేర్కొన్నారు. ఒక్కో విత్తన పాకెట్ ధరను రూ. 1,840 గా నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ఈ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో విత్తుకోవాలని సూచించారు.

?ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కె.బి. దామోదర్ నాయుడుతో పాటు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ అనూష, స్థానిక నాయకులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# ఖాజా పీర్.. నీ స్థాయి చూసుకుని మాట్లాడు: వైసిపి నాయకుల తీవ్ర ఆగ్రహం

పల్లె వెలుగు – ప్యాపిలి మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఆర్థిక శాఖ మాత్యులు



బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై విమర్శలు చేసే స్థాయి టీడీపీ నాయకుడు ఖాజా పీర్‌కు లేదని వైసిపి నాయకులు మస్తాన్ ఖాన్, కొండయ్య, బషీర్, బంగినాగరాజు, వెంకటేష్, రంగనాయకులు, ఎస్. నాగరాజు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శవ రాజకీయాలు చేయడం వైసిపి నైజం కాదని, అది పసుపు పార్టీ మార్క్ రాజకీయాలకే చెల్లుతుందని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ... నల్ల మేకల పల్లె గ్రామంలో ఇటీవల మరణించిన నాగన్న కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించి ఆ కుటుంబానికి భరోసా ఇవ్వడానికి వెళ్తే.. దానిపై కూడా చౌకబారు విమర్శలు చేయడం తీవ్ర సిగ్గుచేటని దుయ్యబట్టారు. స్వచ్ఛందంగా బాధిత కుటుంబానికి అండగా నిలవడాన్ని రాజకీయం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు.

?"రాష్ట్రానికి ఆర్థిక, పాలనాపరమైన దిశానిర్దేశం చేసిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని విమర్శించే అర్హత గానీ, స్థాయి గానీ ఖాజా పీర్‌కు ఎంతమాత్రం లేదు. కేవలం పేపర్లలో, మీడియాలో పబ్లిసిటీ పొందేందుకే ఇలాంటి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు.

?పదవుల కోసం, ఉనికి కాపాడుకోవడం కోసం ప్రతి చిన్న విషయాన్ని రాజకీయం చేస్తూ శవ రాజకీయాలకు పాల్పడుతోంది టీడీపీ నాయకులేనని వారు ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై, ప్రజాదరణ కలిగిన బుగ్గనపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇకనైనా తప్పుడు కూతలు కూయడం మానుకోవాలని వారు హితవు పలికారు.

# ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

## ☛గజ్జహళ్లి యువ నాయకుడు మహమ్మద్ పిలుపు





హోళగుంద పల్లె వెలుగు జులై :22 ఆస్పరి మండల కేంద్రంలో జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి ఆస్పరి మండల కేంద్రంలో శనివారం రోజున జరగనున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభను ఘన విజయవంతం చేయాలని గజ్జహళ్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బాబు సాబ్ తనయుడు, యువ నాయకుడు మహమ్మద్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సభ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కీలక వేదిక అని అన్నారు. ఆలూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి భారీ సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సభను చారిత్రాత్మక విజయంగా నిలపాలని మహమ్మద్ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన నంద్యాల జిల్లా డీఐఈఓ శంకర్ నాయక్




పల్లె వెలుగు –ప్యాపిలి ఇంటర్మీడియట్ విద్యాధికారి డీఐఈఓ శంకర్ నాయక్ బుధవారం ప్యాపిలి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, రికార్డులు వసతులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ప్రత్యేకం సమావేశమయ్యారు.

?ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. కళాశాలలో ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం ఉందన్నారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తున్నారని, ఆయన ఆధ్వర్యంలో చదువుకోవడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని ప్రశంసించారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో బాగా చదువుకొని, ఉత్తమ మార్కులు సాధించి తమ తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

?ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, డీఐఈఓ కార్యాలయ సిబ్బంది శ్రీకాంత్, సంజీవరెడ్డి కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లె ప్రాంతాలలో అపరిశుభ్ర వాతావరణం

బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూలై 22 : బండి ఆత్మకూరు మండలంలో చెదురు ముదురుగా





కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాలలో అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది. ఈ కారణంగా పల్లె ప్రాంతాలలోని ప్రజలు అపరిశుభ్రమైన పరిసరాలతోనే సహవాసం చేస్తున్నారు. మండల పరిధిలో ఉన్న లింగాపురం, ఈర్నపాడు, బండి ఆత్మకూరు,కడమల కాల్వ గ్రామాలలో రోడ్ల వెంట మురికి మురికి నీరు నిలిచిపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బండి ఆత్మకూరు లోని కురువపేటలో డ్రైనేజీ నిర్మాణం లేకపోవడం వల్ల రోడ్డుపై నీరు నిలిచి ఉండటంతో అక్కడి ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కడమల కాల్వ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత 20 సంవత్సరాలు కాలం నుండి ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణం జరగడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడిన నేపథ్యంలో పొలాల గుండా వచ్చే నీళ్ల తోపాటు డ్రైనేజీ నీరు కూడా ఈ ప్రాంతంలో ప్రవహించడంతో నడవడానికి కూడా వీలులేని పరిస్థితి ఉందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఈ సమస్యపై సంబంధిత స్పెషలాఫీసర్ కు వివరించడం జరిగిందని, చూద్దాంలే! అన్న ధోరణితో మాట్లాడారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో జూలై 1 నుండి 20 తేది వరకు 29.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, 20వ తేదీ 23. 4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. అడపా దడపాగా కురిసే వర్షాల కారణంగా దోమలు తమ సంతాన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకొనే పనిలో పడ్డాయి. జూలై నెల నుండి అక్టోబర్ వరకు వర్షాల సీజన్ కావడంతో దోమలు ఇప్పటికే గ్రామాలలో విజృంభిస్తున్నాయి. దోమలు గ్రామాలలో తమ కడుపును నింపుకునేందుకు ప్రజల రక్తాన్ని పీల్చుకొని, వ్యాధుల బారిన పడే ప్రయత్నాలకు పూనుకుంటున్నాయి. అపరిశుభ్రమైన పరిసరాలు, మురుగునీరు నిలువ ఉన్న ప్రాంతాలలో దోమలు తమ స్థావరాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా శాఖకు చెందిన అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇళ్ళ ముందర నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

-----------------------------------------------

# 3,476 తిలకం చుక్కలతో ఆజాద్ చిత్రం

నంద్యాల ప్రతినిధి. జూలై 22 . (పల్లె వెలుగు



):నంద్యాలకు చెందిన శ్రీనివాస రెడ్డి, సుజాత దంపతుల కుమారుడు శేష శయన్ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువు తున్నాడు. చిత్రకళ పై వున్న మక్కువ తో కోటేష్ ఆర్ట్ అకాడమీలో చిత్రకారుడు కోటేష్ దగ్గర శిక్షణ పొందుతున్నాడు. జులై 23 న భారత స్వాతంత్ర సమర యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఆర్ట్ అకాడమీలో 15 అంగుళాల పొడవు,11 అంగుళాల వెడల్పు గల డ్రాయింగ్ చార్ట్ మీద 3,476 తిలకం చుక్కలతో ఆజాద్ చిత్రాన్ని అద్భుతంగా వేసాడు. ఈ చిత్రాన్ని మైక్రో బ్రష్ ద్వారా తిలకం అద్దుకొని వేసాడు. ఈ చిత్రాన్ని కేవలం 2 గంటల సమయంలోనే వేసాడు. ఈ సందర్భంగా వారి గురువు కోటేష్ మాట్లాడుతూ తిలకం చుక్కలతో పొట్రాయిట్ చిత్రాన్ని వేయడం చాలా కష్టం.అయినా ఆజాద్ చిత్రాన్ని అద్భుతమైన రీతిలో వేసాడు.చంద్రశేఖర్ ఆజాద్ స్వాతంత్ర సమర యోధుడు, ప్రముఖ విప్లవ కారుడు.15 సంవత్సరాల వయస్సు లోనే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటిష్ పాలన అంతం చేయాలని సాయుధ పోరాటాన్ని ఎంచుకున్నాడు. ఫిబ్రవరి 27 న 1931 లో అలహాబాద్ (ప్రస్తుత ప్రయాగ్ రాజ్ )ఆల్ఫ్రెడ్ పార్క్ లో బ్రిటిష్ పోలీసులతో జరిగిన భీకర ఎదురు కాల్పులలో తనను తాను తుపాకీ లోని చివరి బుల్లెట్ తో తల కణత పై కాల్చుకొని మరణించారు. బ్రిటిష్ వారికి పట్టుపడకూడదని, వారి చేతిలో చావ కూడదని తనకు తాను కాల్చుకున్నారు. ఆజాద్ గా అమరవీరుడయ్యారు. ఆజాద్ అంటే స్వతంత్ర పోరుడు లేక స్వేచ్ఛ పోరుడు. బానిస కానివాడు. అటువంటి అమరవీరుల గురించి మా స్టూడెంట్స్ కు తెలియాలని ఆజాద్ జయంతి రోజున ఆ మహా వీరున్ని స్మరించు కుంటూ వినూత్న రీతిలో ఈ చిత్రాన్ని వేయించాను. మా స్టూడెంట్ శేష శయన్ చాలా అద్భుతంగా వేసాడు.వానికి హృదయ పూర్వక అభినందనలు తెలుపుతు న్నాను.చిత్రకారుడు శేష శయన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధులు చంద్రశేఖర్ ఆజాద్ అంటే నాకు చాలా ఇష్టం. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వీరుడు. ఆ మహా వీరుని స్మరించుకుంటూ ఆయన చిత్రాన్ని మా గురువు శిక్షణ లో ఈ విధంగా వేసాను. అమర వీరునికి జోహార్లు.

# కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల





తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నంద్యాల నియోజకవర్గస్థాయి క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నాయకులు మరియు పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు .

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల స్వల్ప కాలంలోనే చారిత్రాత్మకమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. ఈ అద్భుతమైన విజయాలను మరియు ప్రజా ప్రయోజనాలను ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**కూటమి ప్రభుత్వం సాధించిన ప్రధాన సంక్షేమ విజయాలు:**

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు వృద్ధులు, చేతివృత్తుల, దివ్యాంగులకు , బెడ్ రెస్ట్ వారికి నెలవారీ పింఛన్లను రూ.4,000, రూ.6,000, రూ.10,000 మరియు రూ.15,000 వరకు పెంచి లబ్ధిదారులకు కొండంత అండగా నిలిచిందన్నారు అన్నదాత సుఖీభవ ప్రతి రైతుకు ఏటా రూ.20,000 పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయ రంగాన్ని రైతును ఆదుకున్నామని తెలిపారు .తల్లికి వందనం ఇంట్లో ఉన్న ప్రతి విద్యార్థికి రూ.15,000 ఆర్థిక సాయం అందిస్తూ చదువులకు భరోసా కల్పించామన్నారు. అన్న క్యాంటీన్లు పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా 269 అన్న క్యాంటీన్ల ద్వారా కేవలం రూ.5 లకే నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు . దీపం-2 పథకం ప్రతి ఇల్లాలు ముఖంలో ఆనందం కోసం ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీని విజయవంతంగా చేపట్టామని తెలిపారు. పేదలకు గృహవసతి అర్హులైన పేద ప్రజల కోసం 5 లక్షల ఇళ్లు మంజూరు చేసి పంపిణీకి సిద్ధం చేశామని మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఉపాధి మరియు ఉద్యోగ విప్లవం మెగా డీఎస్సీ ద్వారా 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, అలాగే 6,000 పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేశామన్నారు. వివిధ వర్గాల సంక్షేమం గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు, వడ్డెర్లకు మైనింగ్ లీజులు, మత్స్యకారులకు ఏటా రూ.20,000 సాయం, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15,000 మరియు చేనేత-పవర్ లూమ్స్ కు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు.

**రాయలసీమ ప్రగతి - మౌలిక వసతుల కల్పన:**

రాయలసీమను రత్నాలసీమగా మార్చేందుకు రూ.12,484 కోట్లతో శరవేగంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం మరియు హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కర్నూలులో డ్రోన్ సిటీ, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్, కడపలో రాయలసీమ స్టీల్ ప్లాంట్, అనంతపురంలో భారీ ఎనర్జీ ప్రాజెక్టులు, నంద్యాల జిల్లాలో సోలార్ మరియు విండ్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని శాశ్వత రాజధానిగా నిర్మిస్తూ, 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం అన్నారు .

ఈ కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబాన్, నంద్యాల టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, గోస్పాడు మండల కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , నంద్యాల మండల టిడిపి కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు, నంద్యాల నియోజకవర్గ ముఖ్య నేతలు, వివిధ విభాగాల అధ్యక్షులు, క్లస్టర్ మరియు బూత్ ఇన్-ఛార్జ్ లు, మరియు భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీనాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దస్తావేజు లేఖరుల పోరాటానికి కాటసాని మద్దతు

**జీవో 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**

**కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడతాయి: మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి**







లిపల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా దస్తావేజు లేఖరులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పూర్తి మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన లేఖరుల డిమాండ్లకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద దస్తావేజు లేఖరుల పొట్టకొట్టే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వేలాది కుటుంబాలను రోడ్డున పడేసే విధంగా ఉన్న ఈ జీవోను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖరులపై రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని సేవలతో పాటు, కక్షిదారుల స్వంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ బాధ్యతను కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగించేలా జీవో 396ను తీసుకురావడం దారుణమన్నారు. ఇది దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తున్న దస్తావేజు లేఖరుల జీవనోపాధిపై కోలుకోలేని దెబ్బ కొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, లేఖరుల హక్కులను కాలరాసే నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, జీవో 396ను తక్షణమే రద్దు చేసి వారి ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కర్నూలు జిల్లా దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్. ఎ. రెహమాన్, ప్రెసిడెంట్ చింతమాను మొహమ్మద్ రఫీ, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సెక్రటరీ చందులతో పాటు నాగశేషు, హనుమంతరావు, ఖుద్దుస్, హుస్సేన్, పంచలింగాల భాష, అన్వార్, సునీల్ కుమార్, ఆంజనేయులు గౌడ్, రామచంద్రారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ప్రజా ఫిర్యాదుకు శాశ్వత, సంతృప్తికర పరిష్కారం అందించాలి.

**-ఎస్ ఎల్ ఏ గడువులోపు అన్ని పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కరించండి.**

**-రీఓపెన్ దరఖాస్తులు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి.**






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించి, ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిజిఆర్ఎస్ నోడల్ అధికారిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ విభాగాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార తీరు, పెండింగ్ దరఖాస్తులు, సేవల నాణ్యత, ఆడిట్ ప్రమాణాలు, పౌరుల అభిప్రాయ సేకరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ప్రజా ఫిర్యాదును కేవలం పరిష్కరించడం మాత్రమే కాకుండా, ఫిర్యాదుదారుడు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన, శాశ్వత పరిష్కారం అందించాలన్నారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ, సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ (ఎస్ ఎల్ ఏ) గడువు ముగియకముందే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరించి ముగించాలని ఆదేశించారు. జిల్లాలో రీఓపెన్ దరఖాస్తుల శాతాన్ని గణనీయంగా తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, సమస్య మూలకారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం అందించడంతో పాటు, పౌరులకు సంతృప్తికరమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా, ప్రీ-ఆడిట్ మరియు ఆడిట్ నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగుపరిచి, వాటి శాతాన్ని పెంచేలా సమర్థవంతమైన విధానాలను అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిజిఆర్ఎస్ సిటిజెన్ ఫీడ్బ్యాక్ క్యూ ఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించడం సేవల నాణ్యతను మెరుగుపర్చడంలో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించే ప్రతి పౌరునికి క్యూ ఆర్ కోడ్ వినియోగంపై అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించి, సమస్య పరిష్కారమైన వెంటనే తమ అభిప్రాయాన్ని నమోదు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పి జి ఆర్ ఎస్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూ ఆర్ కోడ్ బోర్డులు ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ఏర్పాటు చేయబడినట్లు నిర్ధారించుకోవాలని, వాటి నిర్వహణ, వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షలో పిజిఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

# 24న జరుగుతున్న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి.

**విద్యార్థి యువజన సంఘాలు**




ఆదోని (పల్లె వెలుగు): కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోస్టల్ ఆవిష్కరించడం జరిగింది

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థులు భవిష్యత్తును అంధకారంలోకి కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెట్టి ప్రశ్నించే వారిపైనా నిరంకుశ పద్ధతిలో నిర్బంధాన్ని విధిస్తుందని అన్నారు. ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో విద్యార్థులు, బాష్ప వాయువులు ప్రయోగించి తీవ్ర గాయాలపాలయ్యేల డిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరు ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేసిన తప్పుకు జవాబుదారీగా ఉండాలని ప్రశ్నిస్తే క్రూరంగా వ్యవహరించడం హేయమైన చర్య అన్నారు. పోలీసుల దాడిలో ప్రస్తుతం ఒక విద్యార్థిని చావుబతుకుల మధ్య ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. మరొక్కనిమిషం కూడా విద్యా శాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ ఉండకూడదని హెచ్చరించారు. ఛలో లోక్ భవన్, విద్యాసంస్థల బంద్ అందరూ కలిసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు అఖండ,మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న పరిణామాలపై కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదని వాపోయారు. నీట్ పరీక్షా లీకేజ్ కారణంగా రాష్ట్రంలో 50 వేల మందికి పైగా విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారని తెలిపారు. రాష్ట్ర అధికార, ప్రతిపక్ష నేతలు నిరుమేదపాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న మాట్లాడుతూ గత 14 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా 152 పరీక్షా పేపర్లు లీకేజ్ గురయ్యాయని, ఇది కోట్లలో వ్యాపారం అని అన్నారు. పిడిఎస్ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు వీరేష్, బి డి ఎస్ ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఉమేష్ డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేశులు మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు శాంతి యూతంగా ర్యాలీ చేపడితే పోలీసులను మోహరించి, ఇంటర్ నెట్ ఆపేయడం, మెట్రోలను ఆపేయడం చుస్తే బీజేపీ ప్రభుత్వం యువత పోరాటానికి భయానికి లోనవుతుందనేది స్పష్టంగా అర్థమవుతుందని తక్షణమే ఇప్పటికైనా స్పందించి, దర్మేంద్రప్రధాన్ ను బర్త్ రఫ్ చేయాలనీ డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సంజయ్ కార్యదర్శి శశిధర్, నాయకులు లోకేష్ ,రవి, అలీ డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మోహన్, పిడిఎస్ పట్టణ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

# గొర్లగుట్టగ్రామం లో గడ్డివాము దగ్ధం పరామర్శించిన ఎంపీపీ,వైసీపీ నాయకులు




బేతంచెర్ల ( పల్లె వెలుగు జూలై 22 బేతంచెర్ల మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన రైతు, వైసీపీ నాయకుడు హేమనాథరెడ్డి గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసీపీ నాయకుడు బుగ్గన చంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు గోర్లగుట్ట గ్రామానికి వెళ్లి హేమనాథరెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన నష్టంపై ఆరా తీసి, ధైర్యంగా ఉండాలని సూచించారు. రైతుకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుధాకరప్ప, ఇంద్రసేనారెడ్డి, విజయ్, చిన్నన్న, చంద్రశేఖర్, తిరుమలేశ్వర్ రెడ్డి, తిరుమలేష్, వెంకటకృష్ణ, సురేష్, దాదయ్య, టౌన్ ఉపాధ్యక్షులు అడపాల తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి చెరువును వెంటనే శుభ్రం చేసి కాల్వ నీటితో నింపాలి





హోళగుంద పల్లె వెలుగు జులై :22 హోళగుంద మండలంలోని గజ్జహళ్లి గ్రామ త్రాగునీటి చెరువు పూర్తిగా ఖాళీ అయింది. పిచ్చి మొక్కలు, కలుపు మొక్కలతో నిండిపోయింది. ప్రస్తుతం కాల్వకు నీరు వస్తున్న నేపథ్యంలో, ముందుగా చెరువును పూర్తిస్థాయిలో శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించిన తర్వాతే కాల్వ నీటిని నింపాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు. చెరువును శుభ్రం చేయకుండా నీటిని నింపితే నీటి నాణ్యత దెబ్బతిని ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే చెరువును శుభ్రపరిచి, కాల్వ నీటితో నింపేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. “కాల్వలో నీళ్లు వస్తున్నాయి... కానీ తాగునీటి చెరువు మాత్రం ఖాళీగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి చెరువును శుభ్రం చేసి నీటితో నింపాలి” అని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి!

**విద్యార్థులు, విద్యావేత్తలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి!...సిపిఐ ఎఐవైఎఫ్**

బద్వేల్ జులై 22: ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు సాగించిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగాలను

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి వీరశేఖర్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి ప్రభాకర్ లు ఖండించారు. బుధవారం బద్వేల్ పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ, మానవ హారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడమే కాకుండా, న్యాయం కోసం ప్రశ్నించిన యువతపై లాఠీలతో విరుచుకుపడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి ఆధీనంలోని విద్యా వ్యవస్థని క్రమేపి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుని విద్యను కాషాయికరణ చేస్తున్నారని, ఉన్నత విద్యా ప్రవేశ పరీక్ష నిర్వహించే బాధ్యతను ఎందుకు పనికిరాని ఎన్ టి ఏ కి అప్పచెప్పడంతో కేంద్ర ప్రభుత్వం తన చేతులు దులుపుకొన్నది అని విమర్శించారు. గత 12 సంవత్సరాలలో 89 సార్లు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్ష ప్రశ్న పత్రాలు అంగడి సరుకుగా అమ్ముడు పోతుంటే కేంద్ర ప్రభుత్వ పెద్దలు నిద్రమత్తు నటిస్తూ విద్యా వ్యవస్థనీ తిరోగమన దిశగా తీసుకువెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వల్ల రాత్రింబవళ్ళు కష్టపడి చదివిన సుమారు 22 లక్షల మంది విద్యార్థుల కలలు అడియాసలుగా మారాయని, 20 మంది విద్యార్థులు తమ ప్రాణాలు విడిస్తే దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలని 20 రోజులుగా శాంతియుతంగా నిరాహార దీక్ష చేస్తుంటే, సమస్యను పరిష్కరించడం వదిలేసి వారిని అరెస్టు చేసి ఆస్పత్రులకు తరలించి ఉద్యమాన్ని అణచివేయాలని చూడటం అన్యాయమన్నారు. ‘చలో పార్లమెంట్’ పిలుపుతో మెట్రో స్టేషన్లు, రాకపోకల రహదారులన్నీ మూసివేసినప్పటికీ విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున జంతర్ మంతర్ వద్దకు చేరుకుని తమ నిరసన తెలియజేస్తుంటే నిర్దాక్షిణ్యంగా పోలీసుల ముసుగులో ఆర్ఎస్ఎస్ గుండాలు బిజెపి కార్యకర్తలు విద్యార్థులపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని వారు పేర్కొన్నారు. ఎంత అణచివేసినా యువశక్తి ఆగదని ఈ సంఘటన మరో మారు నిరూపించిందని తెలిపారు.

తమ భవిష్యత్తు కోసం ప్రశ్నించేందుకు వచ్చిన విద్యార్థులను క్రిమినల్స్ లాగా పరిగణించి లాఠీలతో కొట్టడం, టియర్ గ్యాస్ ప్రయోగాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే శిక్షించడమే కేంద్రంలోని ఎన్డీఏ (చీణూ) కూటమి నైజమని విమర్శించారు. కేంద్రం లోని నరేంద్రమోడీ ప్రభుత్వం తన మొండి వైఖరి విడనాడి యువత కలలు ఆకాంక్షలకు తగిన విధంగా నడుచుకోవాలని లేని పక్షంలో ఒకప్పుడు కేవలం రెండు పార్లమెంట్ సీట్లతో ప్రయాణం ప్రారంభించి నేడు దేశాన్ని ఏలే స్థాయికి వచ్చిన బీజేపీ నాయకత్వం, ఈ రోజు యువతపై ప్రదర్శిస్తున్న నిరంకుశ వైఖరికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. భవిష్యత్ లో ఆ రెండు సీట్లు కూడా దక్కకుండా చేస్తారని, యువతను ఎదురించి ఏ ప్రభుత్వమూ నిలబడలేకపోయిందనే చరిత్రను, దేశ విదేశాలలో జరుగుతున్న వర్తమాన పరిస్థితులను ఎన్డీఏ ప్రభుత్వం గుర్తెరిగి నడుచుకోవాలని హితవు పలికారు. తక్షణమే విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, నీట్ బాధితులకు తక్షణమే పూర్తిస్థాయిలో న్యాయం చేసేంతవరకు పోరాటం చేస్తామని వారు హేచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ ఏరియా, పట్టణ కార్యదర్శులు పిడుగు మస్తాన్, పెద్దుల్లపల్లి బాలు ఏరియా సహాయ కార్యదర్శులు ఇమ్మానుయేల్, పి వి రమణ జిల్లా సమితి సభ్యులు పదిగే వెంకటరమణ పెంచలయ్య ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు మునిరత్నం శ్రీనివాసులు సుమంత్ భారీ స్థాయిలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి.

**- నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి డీఎస్ఎఫ్ డిమాండ్**

ఆదోని (పల్లె వెలుగు): అనంతరం ఆర్ట్స్ కళాశాల రోడ్డుపై ధర్నా కార్యక్రమం






నిర్వహించారు. ధర్నా ను ఉద్దేశించి డీ.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం ఉదయ్, రాష్ట్ర కార్యదర్శి బాలు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ అత్యంత తీవ్రమైన వైఫల్యమని పేర్కొన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఢిల్లీలో విద్యార్థులు నిర్వహించిన ప్రజాస్వామ్యబద్ధమైన నిరసన కార్యక్రమంపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని డీఎస్ఎఫ్ తీవ్రంగా ఖండించింది. తమ హక్కుల కోసం పోరాడుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర, పారదర్శక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డీఎస్ఎఫ్ డిమాండ్ చేసింది.

# గుంతల మయమైన ప్రధాన రహదారులు.

**☛నిర్లక్ష్యం వహిస్తున్న రోడ్లు భవనాల శాఖ అధికారులు.**

**☛పాండవగల్లు పాతూరు ఆంజనేయస్వామి ద్వారం దగ్గర ఆదోని - మాధవరం ఆర్ అండ్ బి రోడ్డు గుంతపూడ్చాలని డివైఎఫ్ఐ రాస్తారోకో.**

ఆదోని (పల్లె వెలుగు): ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం గుంతలు పూడ్చి రోడ్లు బాగు చేశామని





చెప్పుకుంటున్నారని, ఆ గుంతలు పూడ్చిన నెల రోజులకే మళ్లీ గుంతలు పడ్డాయని, అలాగే రోడ్డుకు ఇరువైపులా రోడ్డు అంచులు కోతకు గురై అడుగు లోతు ఉన్నాయని దీనివలన వాహనాలు ఎదురెదురు వచ్చిన సందర్భాల్లో ద్విచక్ర వాహనదారులు కొంతమంది సైడ్ కు దిగలేక ప్రమాదాల బారిన పడినట్లు తెలిపారు.ఈ మధ్య కాలంలోనే గణెకల్ – పాండవుగల్ మధ్యలో సుమారు 10 మంది దాకా రోడ్డు ప్రమాదంలో మరణించినప్పటికీ ఆర్ అండ్ బి అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని డివైఎఫ్ఐ మండల నాయకులు చిరంజీవి మోహన్ రెడ్డి, వీరేష్, వ్యవసాయ కార్మిక సంఘం, మండల నాయకులు గోవిందు ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొన్ని రోజుల్లో శ్రావణమాసం ప్రారంభమవుతుందని మరిన్ని ప్రమాదాలు జరగకముందే గుంతలు పూడ్చాలని రోడ్డుకి ఇరువైపులా గరుసు వేసి చదును చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గుంతను మట్టివేసి పూడ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# తల్లికి వందనం పథకం కింద డబ్బులు జమ

**☛నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలిపిన**

**☛విద్యార్థులు గ్రామ టిడిపి నాయకులు**



నందవరం పల్లె వెలుగు జూలై 22 నందవరం మండలంలో కనకవీడు గ్రామం లోని విద్యార్థిని విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద 1113 మంది కి.14469000 రూపాయలు జమ కావడం జరిగింది. ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్ర బాబు నాయుడు కి అదే విధంగా . విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి.ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి. కి కనకవీడు గ్రామ ప్రజలు కనకవీడు మహిళలు ఎంతో హర్షం వ్యథం చేయడం జరిగింది. స్కూలు విద్యార్థిని విద్యార్థులు సిఎం సార్ ధన్యవాదాలు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కనకవీడు టిడిపి అధ్యక్షులు డబ్బా ఈరన్న మాట్లాడుతు సూపర్ సిక్స్ లో భాగంగా ప్రతి పథకం ను క్రమం తప్పకుండా అమలుచేస్తారని చెప్పడం జరిగింది.అదే విధంగా గత ప్రభుత్వం కుటుబంలో ఒకరి కె ఇచ్చేది అదీ కూడా కొంత మంది విద్యార్థులకు జమ కావడం జరిగిందని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉప అధ్యక్షులు రామలింగప్ప డీలర్లు నరసింహులు ,దుబ్బన్న, మునిస్వామి ,అశోక్ కుమార్, ఆదాం, ఈరన్న మల్లన్న, పరమేష్, విద్యార్థులు పాల్గొన్నారు

# దివ్యాంగుల సామాజిక సంక్షేమాభివృద్ధే ఎన్డీఏ కూటమి ధ్యేయం.

**● ఘనంగా డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవం.**

**● ఆదోని శాసన సభ్యులు పార్థసారథి.**

**● రాష్ట్ర డిఈఎఫ్ గౌరవాధ్యక్షులు మల్లేల ఆల్ఫ్రెడ్ రాజు**

ఆదోని (పల్లె వెలుగు): బుధవారం ఆదోని పట్టణంలోని "రెడ్డి జన సంఘం కమ్యూనిటీ హాల్ / రెడ్డి హాస్టల్ "లో రాష్ట్ర డిఈఎఫ్ అధ్యక్షులు బి సి నాగరాజు, ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ ల ఆధ్వర్యంలో "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, పట్టణ పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు, అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా డిఈఎఫ్ జండా ఆవిష్కరణ గావించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదోని శాసనసభ్యులు పార్థసారథి, రాష్ట్ర డిఈఎఫ్ గౌరవాధ్యక్షులు ఆల్ఫ్రెడ్ రాజు, జిల్లా టిడిపి యువ నాయకులు దివాకర్ రెడ్డి, కర్నాటక సిని పరిశ్రమ డైరెక్టర్ గురుమూర్తి, సిపిఐ నాయకులు వీరేష్ తదితరులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో సభావేదిక ద్వారా దివ్యాంగులు పలువురు వారి, వారి సమస్యలను ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి








తీసుకురాగ ఖచ్చితంగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, త్వరలో ప్రజాప్రభుత్వ ఉన్నతాధికారుల, సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు, అదేవిధంగా మల్లేల ఆల్ఫ్రెడ్ రాజు, దివాకర్ రెడ్డి, గురుమూర్తి తదితరులు మాట్లాడుతూ చాలా వరకు ప్రభుత్వ సామాజిక సంక్షేమ ఫలాలు దివ్యాంగుల దరికి చేరడంలో జాప్యం జరుగుతుందని కావున అవసరమైతే దివ్యాంగుల గళం బలంగా వినిపించాలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ జిల్లా విభాగం నాయకులు ఇస్మాయిల్, ఎర్రిస్వామి, విశ్వనాథ్, నర్సింహులు, రాజశేఖర్ గౌడ్, ఆదోని డివిజన్ వికలాంగుల కన్వీనర్ హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూటమి వైఫల్యాలపై సీపీఐ శంఖారావం.

**☛26న బనగానపల్లెలో నంద్యాల జిల్లా విస్తృతస్థాయి సమావేశం.**

**☛హాజరుకానున్న రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు పిలుపునిచ్చారు. ఈ నెల 26న బనగానపల్లె పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ నంద్యాల జిల్లా జనరల్ బాడీ (విస్తృతస్థాయి) సమావేశాన్ని శ్రేణులంతా కదలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

?బుధవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం పెన్షన్లు, పాస్ పుస్తకాల పంపిణీతో ప్రచార ఆర్భాటాలు చేయడమే తప్ప, ప్రజల ప్రధాన సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు.



నిరుద్యోగులను వంచిస్తూ జాబ్ క్యాలెండర్ ఊసెత్తకపోవడం, బలవంతపు భూసేకరణతో పేదల పొట్టగొట్టడం, పెండింగ్ ప్రాజెక్టులను పక్కనపడేయడంపై సీపీఐ తేల్చుకునేందుకు సిద్ధమైందన్నారు.

?ప్రభుత్వ నిరంకుశ, వైఫల్య విధానాలపై ఉమ్మడి ఉద్యమ కార్యాచరణను రూపొందించడానికే ఈ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవ నాయకులు పి. రామచంద్రయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని 29 మండలాల పార్టీ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, మహిళలు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ సమావేశాన్ని విప్లవాత్మకంగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

?ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే భాస్కర్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న సిపిఐ జిల్లా సమితి సభ్యులు నరసింహులు. జిలాని భాష తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత: రాష్ట్ర మంత్రి టీజీ భరత్

**- కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నూతన 'పికిల్ బాల్' కోర్ట్ ప్రారంభం**
**- రూ.2.5 కోట్లతో స్టేడియం ఆధునీకరణ, సింథటిక్ వాకింగ్ ట్రాక్ నిర్మాణం**





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ప్రోత్సహించి, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'పికిల్ బాల్' (గాఅఎెశ్రీవఝశ్రీశ్రీ) కోర్ట్‌ను మంత్రి రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు.



రూ. 2.5 కోట్లతో మైదానం అభివృద్ధి ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... కర్నూలు అవుట్‌డోర్ స్టేడియాన్ని రూ. 2.5 కోట్ల అంచనా వ్యయంతో సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సింథటిక్ వాకింగ్ ట్రాక్ తో పాటు, నూతన వాలీబాల్ కోర్ట్‌ను కూడా అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు.

"ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా-ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడల వికాసానికి విశేష కృషి జరుగుతోంది. అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయించి అవుట్‌డోర్ స్టేడియంలో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తాం."

--- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

ఆక్రమణలపై కఠిన చర్యలు

నగరంలోని ప్రముఖ ఎస్టిబిసి (గాదీజ) కళాశాల మైదానం ఆక్రమణలకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు, ప్రజలకు మేలు చేకూర్చే పనులకు నాంది పలుకుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఆయన కోరారు. హాజరైన ప్రముఖులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో: సోమిశెట్టి వెంకటేశ్వర్లు (కుడా చైర్మన్) విక్రమ్ సింగ్ (బొందిలి కార్పొరేషన్ చైర్మన్) మన్సూర్ అలీ ఖాన్ (రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు) చల్లా ఓబులేసు (కర్నూలు మున్సిపల్ కమిషనర్) భూపతి రావు (డీఎస్డీవో) మరియు ఇతర స్థానిక నాయకులు, క్రీడాకారులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం

● ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ● పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి. ● తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు. ● కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ అబ్జర్వర్ కేశవరెడ్డి.







ఆదోని (పల్లె వెలుగు): ఈరోజు ఆదోని పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, ఆదోని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆదోని నియోజకవర్గ అబ్జర్వర్ కేశవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27వ తేదీ నుంచి క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. అదేవిధంగా, ఆదోని నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నాయుడు కొనసాగుతున్నారని, పార్టీ శ్రేణులందరూ ఆయన నాయకత్వంలోనే పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. పార్టీపై వస్తున్న తప్పుడు ప్రచారాలను కార్యకర్తలు నమ్మవద్దని, పార్టీ అధిష్ఠానం నిర్ణయాలే అందరికీ మార్గదర్శకమని తెలిపిన ఉమాపతి నాయుడు అనంతరం నియోజకవర్గ అబ్జర్వర్ కేశవ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాల్లో ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు వివరించడం పార్టీ కార్యకర్తల బాధ్యత అని చెప్పారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐకమత్యంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అధిష్ఠానం ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచేలా క్రమశిక్షణతో, సమన్వయంతో పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మరింత ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న రంగస్వామి నాయుడు, శ్రీకాంత్ రెడ్డి, బుద్ధారెడ్డి, ఉమ్మి సలీం, బసాపురం రామస్వామి, జిందె శంకర్, పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప, మండల అధ్యక్షులు శివప్ప, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ డైరెక్టర్ రామకృష్ణ, కర్నూల్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రంగన్న, కర్నూల్ పార్లమెంటు ఉపాధ్యక్షులు బసవరాజు, లక్ష్మీనారాయణ, అఫ్సర్ భాష, అల్తాఫ్, అంజనమ్మ, వీరేష్, రవి, సంజీవ్, బాబు నాయుడు, శ్రీనివాస్ ఆచారి, అయ్యన్న, విరుపాక్షి, బాలస్వామి, ఈరన్న, ఐ సి రామకృష్ణ, సజ్జత్, మల్లికార్జున, మనోహరయ్య పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్దేశిత ఆదాయ లక్ష్యాల సాధనే జిల్లా ఆర్థికాభివృద్ధికి కీలకం.

## రెవెన్యూ వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి...అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలి.

*- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.*






పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో వివిధ శాఖలకు ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి జిల్లాను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేలా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్, రవాణా, ఆర్టీసీ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల ఆదాయ పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక ఆదాయ లక్ష్యాలను ప్రతి శాఖ బాధ్యతాయుతంగా సాధించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన శాఖలు ప్రత్యేక దృష్టి సారించి ఆదాయ వృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మైనింగ్ శాఖకు 2026 -27 ఆర్థిక సంవత్సరానికి మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా రూ.279 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. తొలి త్రైమాసికంలో రూ.55.90 కోట్ల ఆదాయం లభించగా, రెండో త్రైమాసికానికి రూ.58.50 కోట్ల లక్ష్యం కేటాయించిన నేపథ్యంలో ఇప్పటివరకు రూ.19.54 కోట్ల ఆదాయం సమకూరిందని కోరుకుంటూ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఎక్సైజ్ శాఖకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.1,189 కోట్ల వార్షిక లక్ష్యం నిర్దేశించగా, తొలి త్రైమాసిక లక్ష్యం రూ.261.81 కోట్లకు గాను రూ.285.97 కోట్ల ఆదాయం సాధించి 9.2 శాతం వృద్ధి నమోదు చేసినట్లు వెల్లడించారు. అదే సమయంలో నవోదయం - 2.0 కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వాణిజ్య పన్నుల శాఖకు రూ.440 కోట్ల వార్షిక లక్ష్యం ఉండగా, జూన్ వరకు రూ.109 కోట్ల లక్ష్యానికి గాను రూ.109.98 కోట్ల ఆదాయం సాధించడం అభినందనీయమన్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో నెలకు రూ.15 వేలకుపైగా వేతనం పొందుతున్న ఉపాధ్యాయుల వివరాలను వెంటనే అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. రవాణా శాఖకు 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి రూ.150.90 కోట్ల వార్షిక లక్ష్యం నిర్దేశించగా, తొలి త్రైమాసిక లక్ష్యం రూ.38.07 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.35.15 కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖకు రూ.256.15 కోట్ల వార్షిక లక్ష్యం ఉండగా, తొలి త్రైమాసిక లక్ష్యం రూ.76.98 కోట్లకు గాను రూ.69.68 కోట్ల ఆదాయం సాధించి రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టీసీకి 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.77.42 కోట్ల ఆదాయ లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటికే రూ.78.63 కోట్ల ఆదాయం సాధించి లక్ష్యాన్ని అధిగమించినట్లు తెలిపారు. అన్ని శాఖలు సమిష్టి కృషితో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించి జిల్లాను ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# తల్లికి వందనం జాబితా ప్రతి సచివాలయంలో జాబిత : డిప్యూటీ ఎంపీడీఓ అశ్విన్ కుమార్



శిరివెళ్ల ; పల్లె వెలుగు)మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల ప్రతి సచివాలయంలో తల్లికి వందనం అర్హులు అనర్హుల జాబితాను బహిరంగంగా నోటీస్ బోర్డ్ లో అతికించినట్లు డిప్యూటీ ఎంపీడీఓ అశ్విన్ కుమార్ తెలియజేశారు. శిరివెళ్ల మండల కేంద్రంలోని 1వ సచివాలయంలో ఆయన అర్హుల జాబితా వద్ద లబ్ధిదారులకు మాట్లాడుతూ పలు సూచనలు సలహాలు అందజేశారు. అర్హులు అనర్హుల జాబితాను పరిశీలించి అనర్హులు ఎవరైనా ఉంటే సంబంధిత పాఠశాల విద్యాశాఖ అధికారులను ప్రధానోపాధ్యాయులను సంప్రదించి తగిన డాక్యుమెంటును అప్లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు ఈ సందర్భంగా స్థానిక శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ గారి ఆదేశాల మేరకు ఆయా గ్రామాలలోని సచివాలయాలలో తల్లికి వందనం అర్హుల జాబిత అందుబాటులో ఉంచామని అర్హుల జాబిత వద్ద లబ్ధిదారుల రద్దీ స్పష్టంగా కనిపించిందన్నారు. మధ్యాహ్నం నుండి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ కావడం పట్ల విద్యార్థులు వారి తల్లిదండ్రులలో ఆనందోత్సహాలతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ నరసింహ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గర్భిణి మృతి ఘటనపై రేఖ నర్సింగ్ హోమ్, వైద్యులపై

● కేసు నమోదు చేయాలని సీఐకి,, ● బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు,






ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 22 ఎమ్మిగనూరు టౌన్‌లో గర్భిణి జి. ఉరుకుందమ్మ మృతి ఘటనపై రేఖ నర్సింగ్ హోమ్ యాజమాన్యం, డాక్టర్ రేఖ, చికిత్సలో పాల్గొన్న వైద్యులు, నర్సులు మరియు సంబంధిత సిబ్బందిపై వైద్య నిర్లక్ష్యం ఆరోపణలతో తక్షణమే కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కనిగిరి రాముడు కి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. గర్భిణి మరణానికి దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయి విచారణ జరిపి, రేఖ నర్సింగ్ హోమ్‌లోని చికిత్స రికార్డులు, కేస్ షీట్లు, రిఫరల్ వివరాలు, అంబులెన్స్ రికార్డులు, సీసీటీవీ ఫుటేజ్ (ఉంటే) మరియు ఇతర సంబంధిత ఆధారాలను స్వాధీనం చేసుకుని, నిజానిజాలను వెలికితీయాలని వారు డిమాండ్ చేశారు. వైద్య నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రజాసంఘాల నాయకులు తమ సంఘీభావం ప్రకటించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని అదేవిధంగా భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని ఉన్నతాధికారులకు కలిసి స్వతంత్ర డాక్టర్స్ తో విచారణ చేపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రామతీర్థం అమ్రేష్, గడ్డం నాగేంద్ర, రాజేష్, నరసన్న, మాల నరసప్ప, లక్ష్మన్న, రఘు, గడ్డం హుసేని పాల్గొన్నారు. అదేవిధంగా బాధిత కుటుంబ సభ్యులు మాదిగుండు ఈరన్న, సునీత, వీరమ్మ, చిన్న వీరమ్మతదితరులు పాల్గొన్నారు.

# పి ఆర్ఎస్ వై ఎఫ్ ప్రథమ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కర,




ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 22 ప్రగతిశీల రెవల్యూషనరీ స్టూడెంట్ యూత్ ఫెడరేషన్ ( పి ఆర్ ఎస్ వై ఎఫ్ ) ప్రథమ రాష్ట్ర మహాసభల లోగోను ఎమ్మిగనూరు జూనియర్ కళాశాల ముందు నేడు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా టిఆర్ఎస్ వై ఎఫ్ జిల్లా కన్వీనర్ సావడి రఘునాథ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని విద్యార్థి--యువజన సమస్యల పరిష్కారమే మహాసభల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం విద్యా హక్కు, ఉపాధి హక్కు సాధన దిశగా పి ఆర్ ఎస్ వై ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఎస్ వై ఎఫ్ నాయకులు రాజు, మధు, జష్వా, ఆనంద్ రాజు, వీరేష్, నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు

# నమస్తే ఎమ్మిగనూరు ప్రజా సమస్యలపై పోరుబాట



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూలై 22 నమస్తే ఎమ్మిగనూరు ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి నేడు పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మిగనూరు పట్టణం 2వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిరిసాల రాము ఆహ్వానం మేరకు ఆయన స్వగృహానికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్న సిరిసాల రాము ని ఆప్యాయంగా కలుసుకుని, పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలతో, నాయకులతో, కార్యకర్తలతో నిత్యం మమేకమవుతూ వారి కష్టసుఖాలను తెలుసుకోవడమే తన రాజకీయ ప్రయాణానికి బలమని అన్నారు. ప్రతి ఇంటిని, ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అందరినీ కలుపుకుని ముందుకు సాగే రాజకీయ సంస్కృతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని పేర్కొన్నారు. ప్రజలతో నిరంతర అనుబంధాన్ని కొనసాగిస్తూ, నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం రాజీవ్ రెడ్డి చేస్తున్న కృషి పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజల ప్రశంసలను అందుకుంటోంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి మాచని వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టా రంగయ్య, మాజీ వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ రియాజ్ అహ్మద్, మాజీ స్టోర్స్ డైరెక్టర్ షబ్బీర్ అహ్మద్, పట్టణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.ఆర్. నటరాజ్ రెడ్డి, విశ్వనాథ్ రమేష్, చేనేత మల్లి, బంగి శ్రీరామ్, మాచని సోమేశ్, పంపయ్య, మాచని రఘు, వెంకటాపురం రాజు, సోమేశ్, దరాల శ్రీను, డిష్ కేశవ రెడ్డి, ఖాజా, డిష్ ప్రసాద్, ఎమ్మిగనూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ కేశన్న, పేట శ్రీనివాస్ రెడ్డి, ఎస్.కే. బాబూలాల్, చిన్నమరివీడు కృష్ణ, రాము, మధు, శివ, శ్రీను, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com